మూగ జీవాలకు అందని వైద్యం

- భర్తీకాని డాక్టర్, సహాయకుల పోస్టులు
- శిథిలావస్థలో పశు వైద్యశాల



శిథిలావస్థకు చేరిన కాగుపాడు పశువుల ఆసుపత్రి భవనం

ఉంగుటూరు: కాగుపాడు పశువుల ఆసుపత్రి శిథిలావస్థలో ఉంది. దీంతో ఈ పశు వైద్యశాలలో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఆసుపత్రి ఖాళీగా దర్శనమిస్తోంది. డెల్టాలోని మీఏ పురం కాకర్లమూడి, బొమ్మిడి, ఉప్పాకపాడు, దొంతవరం, పొట్టిపాడు, దేవర కొండేపాడు, కాగుపాడు, రావులపర్రు, రాచూరు, సీతారామపురం గ్రామాలకు ఏకైక పశువుల ఆసుపత్రి కాగుపాడులోనే ఉంది. సుమారు 28 వేలు పశువులు ఈ ఆసుపత్రికి అటాచ్ అయి ఉన్నాయి. ఈ ఆసుపత్రి భవనాన్ని దివంగత మాజీ సర్పంచి కడియాల రామయ్య హయాంలో నిర్మించారు. 1972 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ గోవిందరాజును తీసుకొచ్చి ప్రారంభోత్సవం చేయించారు. చాలా కాలం ఈ ఆసుపత్రి బాగా నడిచింది. 11 గ్రామాల రైతులు తమ పశువులకు ఏమి వచ్చినా ఈ ఆసుపత్రికి తోలుకొచ్చి పశు వైద్యం చేయించేవారు.

వ్యవసాయంపై మక్కువతోనే..

అప్పటి సర్పంచి కడయాల రామయ్యకు వ్యవసాయం అన్నా, పశువులు అన్నా ప్రత్యేక శ్రద్ధ ఉండేది. దీంతో పట్టుదలతో ఆ నాడే పశువుల ఆసుపత్రిని గ్రామానికి మంజూరు చేయించడం, ఆసుపత్రి భవనాన్ని నిర్మించడం చేశారు. ప్రస్తుతం ఈ భవనం దశాబ్ద కాలం నుంచి శిథిలావస్థలకు చేరింది. గోడల మీద మొక్కలు కూడా మొలిచాయి. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో అన్న చందంగా ఇక్కడ పరిస్థితి తయారైంది. దీంతోనే పశువుల డాక్టర్లు ఎవరూ ఆసుపత్రిలో పని చేయడానికి ఇంట్రస్టు చూపడం లేదు. దీంతో డాక్టరు పోస్టు, సహాయకుని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రైతులు అయితే ప్రైవేట్ పశువుల వైద్యులను ఆశ్రయించి కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పశువుల ఆసుపత్రికి నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉన్నతాధికారులు ఎవరూ ఈ ఆసుపత్రిని పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీషను ప్రశ్నించగా ఈ పశువుల ఆసుపత్రి శిథిలమైన విషయం ఆర్ఐడీఎఫ్‌లో ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు.

నయవంచక పాలనకు కాలం చెల్లుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

గణపవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నయవంచ పాలన సాగిస్తున్నాయని, కాలం చెల్లుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళవారం గణపవరంలోని కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో నిర్వహించిన గణపవరం మండల సీపీఐ 4వ విస్తృత మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు తాడేల వాసు, పెనకంటి శ్రీను, కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారామ్ ప్రసాద్, గంజి రాజు, సనపల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

నిడమర్రు: పెదనింద్రకొలను గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కోడే కాశి కార్యాలయం వద్ద సభ ఏర్పాటు చేసారన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని సత్యకుమార్ పిలుపునిచ్చారు.

గారపాటి గోపికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గారపాటి గోపిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది, విశ్రాంతి తీసుకుంటున్న గారపాటి గోపి త్వరగా కోలుకోవాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గారపాటి వాసు కుమారుడు గారపాటి గోపి హాస్పిటల్లో చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి అబ్బయ్యచౌదరి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బాలికల హాస్టల్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న పెదవేగి సీఐ రాజశేఖర్

దెందులూరు: విద్యార్థులు భద్రంగా ఉండాలంటే వారికి మనం సాంకేతిక ప్రపంచంలోని నష్టాల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. శింగవరం సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో పెదవేగి సీఐ రాజశేఖర్ సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైం, ప్రమాదాలు, వర్షాకాలంలో వ్యాధులు, సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కనకదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న గన్ని వీరాంజనేయులు

భీమడోలు: రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడిగా రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పదవీ బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. భీమడోలు సొసైటీ కార్యాలయంలో ఆ శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమంలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, డీసీసీబీ సీఈవో సింహాచలం, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఏ.శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, త్రిసభ్య కమిటీ సభ్యులు గేదెల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దళితుల శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే ధర్మరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

గణపవరం: గణపవరం మండలం అర్ధవరం గ్రామంలోని దళితపేట శ్మశాన వాటికను విస్తరించి, అభివృద్ధి చేయాలని కెవీపీఎస్ మండల అధ్యక్షుడు చిన్నం చిననాగేశ్వరరావు కోరారు. మంగళవారం గ్రామంలో పల్లెపల్లెకు కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. దళితపేటలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించాలని, మంచినీటి చెరువుకు రక్షణగోడ నిర్మించాలని, జెడ్పీ రోడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, తహసీల్దార్ అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా 'టాటా' జయంతి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. మంగళవారం తపన ఫౌండేషన్ కార్యాలయంలో భారతరత్న జేఆర్‌డీ టాటా జయంతి గనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ కాలేజీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

బాల్య వివాహాల నిరోధంపై నాటిక ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కళాకారులు

ఉంగుటూరు: బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమ వీధి నాటిక ప్రదర్శన కార్యక్రమం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్‌ఎం జి.గవరయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుతూ వ్యక్తిగత అభివృద్ధికి కుటుంబ అభివృద్ధికి పాటు పడే విధంగా ఉండాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండకుండా ఆడ పిల్లలకు వివాహాలు చేయకూడదని వివరించారు. క్రాప్ష జిల్లా మేనేజరు రవిబాబుమాట్లాడుతూ సమాజంలో బాలికలపై జరుగుతన్న వివక్షత నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు చేయాలని చూస్తే మహిళా పోలీసు, రెవెన్యూ అధికారులకు చైల్డు హెల్ప్‌లైన్ 1098కి, పోలీసులకు సమాచారాన్ని అందించాలని సూచించారు. సీహెచ్ రేఖ, ఉపాధ్యాయులు వైకే స్వర్ణలత, పి.సత్యకళ, ఎం.రవిశంకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ తిరుమలరావు

ఉంగుటూరు: ఉపాధిహామీతోపాటు పింఛన్లు ఇతర ప్రభుత్వ స్కీముల అమలు తీరుపై సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహిస్తామని ఎస్ఆర్‌పీ తిరుమలరావు అన్నారు. నేటి నుంచి అగస్టు 13వ తేదీ వరకు నిర్వహించే సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు సహాయకులు, వెల్ఫేర్ సహాయకులతో మంగళవారం ఎంపీడీవో ఆఫీసులో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు అనుసరించి తనిఖీలు ఉంటాయని తిరుమలరావు తెలిపారు. ఎంపీడీవో రాజీమనోజు మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల తనిఖీలు జరుగుతాయని ఈమేరకు ప్రభుత్వం నియమించిన బృందాలు పని చేయనున్నాయని తెలిపారు. ఫీల్డు సహాయకులు ఆ బృందం సభ్యులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి



డెంగీ అవగాహన ప్రదర్శన చేస్తున్న పీఎంపీ సభ్యులు

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు డెంగీ వ్యాధి వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిర్మూలనకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య అన్నారు. మంగళవారం గణపవరంలో డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జయసూర్య ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల ఆవాసాలను గుర్తించి, రసాయనాలు చల్లి నిర్మూలించాలని సూచించారు. జిల్లా పీఎంపీ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడుతూ దోమల నిర్మూలనతోనే డెంగీ రాకుండా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి శివ శ్రీనివాసరావు, మూర్తి, సంకు శ్రీను పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గం

గణపవరం: మానవత సేవలు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి ఆపన్నులకు అండగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తుందని మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు, మానవత కార్యక్రమాల పర్యవేక్షకుడు సాగిరాజు జానకి రామరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండల మానవత నూతన కార్యవర్గ ఎన్నికలు కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనంలో మండల మానవత చైర్మన్ కాకర్ల వినాయక అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జానకిరామరాజు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఇప్పటికే జిల్లాలో 60 శాతం గ్రామాలకు ఫ్రీజర్లు అందచేశామని, అలాగే దహన సంస్కారాలకు శాంతి రథాలను ఉచితంగా అందిస్తుందన్నారు. మండలానికో శాంతి రథం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మానవత తరపున విద్యార్థులకు మనోవికాస కార్యక్రమం, ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మానవత జిల్లా నాయకులు పుప్పాల గోపి, సుబ్బారావు, మానవత సభ్యులు బుద్దారపు పుల్లయ్య, పెరుమాళ్ల ఆంజనేయులు, వంకాయల రామారావు, హరికుమార్‌రాజు, ఎంఎల్ఎస్ఎస్ నారాయణ, శంకరం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ నిరసన యాత్ర



బువ్వనపల్లిలో నిరసన పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు

నిడమర్రు: మా ఊరి ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించొద్దని సీపీఎం నాయకులు మంగళవారం బువ్వనపల్లి ఇందిరమ్మ కాలనీలో నిరసన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బలవంతంగా బిగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దీన్ని తీవ్రంగా వ్యతిరేఖించాలన్నారు. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఆదాని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని, బద్దాలు కొట్టాలన్నారు. ఇంటింటకి తిరిగి కరపత్రాలు అందిచారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగేటి మోహన్, కానూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఖాతాలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ప్రతినిధులు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కే. పంకజ్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమకాకపోవడం వల్ల పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారిందన్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వ యాజమాన్యంలో విలీనమైన ఎయిడెడ్ పాఠశాలలకు కూడా కాంపోజిట్ గ్రాంట్స్ విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం సమర్పించి వారిలో ఏపీటీఎఫ జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు, ఏలూరు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి టీ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రవీంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందనీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టి.నరసాపురం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము ప్రభాకర్ కుమారుడు కొమ్ము రవీంద్ర ఆయిల్‌పామ్ గెలలు నరుకుతుండగా విద్యుత్ షాక్‌తో ఇటీవల చనిపోయారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం అవుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. చనిపోయిన రవీంద్ర కుటుంబ నష్టపరిహారం ఫ్యాక్టరీ నుంచి రూ.10 లక్షలు, విద్యుత్ శాఖ నుంచి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాయింట్ కలెక్టర్ ఆదేశాలు అమలు చేయాలి



తహసీల్దార్ సుమతి

దెందులూరు: నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు అమలు చేయాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా గ్రామ మండల స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయలన్నారు. ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చూడాలన్నారు. సరుకులు నిల్వ చేసి బహిరంగ మార్కెట్‌లో ధరలు పెంచే అవకాశం ఉన్నందున అక్రమ నిల్వలపై గ్రామ స్థాయి ఉద్యోగులు నిఘా ఉంచాలని ఆదేశించారు.

31లోగా జూనియర్ కళాశాలలో చేరొచ్చు

పెదపాడు: మండలంలోని పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 31 వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు పెదపాడు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ తెలిపారు. ఇంటర్‌లో ప్రవేశించిన విద్యార్థులకు తల్లికి వందనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. అత్యున్నత స్థాయి విద్యాబోధన అందిస్తున్నామని ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు 31వ తేదీ లోగా కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని చెప్పారు.

అన్నదానం

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం పురష్కరించుకొని అన్నదానం నిర్వహించారు. 200 మందికి నిర్వహించిన ఈ అన్నదానానికి ఎన్నారై ఆర్థిక సాయం అందించారు. తొలుత ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో వేమూరి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు దాతలు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో మార్పు

పెదవేగి: పెదవేగి సెక్షన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతన లైన్ నిర్మించనున్నారు. ఈ లైన్ నిమిత్తం పెదవేగి నుంచి వెళ్లే కూచింపూడి, రామసింగవరం ఫీడర్లకు, మైల్ ఎనర్జీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రామసింగవరం పరిధిలో గల వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ ముందుగా తెల్లవారు జామున 3 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతలుగా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. పెదవేగి సబ్ స్టేషన్ పరిధిలోని ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు, స్కూలు ఏరియా, సీతాపురంలో విద్యుత్ గృహ వినియోగదారులకు మాత్రమే విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సంవత్సరం తర్వాత ఉచిత బస్సు పథకమా?

దెందులూరు: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పట్టించుకోకపోవడంపై ఏలూరు జెడ్పీటీసీ సభ్యురాలు మండల సరస్వతి, దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు రూరల్ మండలం శ్రీపరులో వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సరం తర్వాత ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని అమలు చేస్తాననడం ఏంటి?అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానన్న హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారు? అని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకపోవడంతో సంవత్సరం లోపే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని మండిపడ్డారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో మహిళలు, బాలికలు, యువతుల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాలపై విద్యార్థినిలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సీతారామారావు సూచించారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కామర్స్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో సెక్సువల్ హెరాస్మెంట్ యాక్ట్ -2013పై మంగళవారం ఆయన అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతారామ రావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునీశ్వర రావు, మాస్టర్ ట్రైనర్ పి.రత్న రాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బాల బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: బాల బాలికలు, యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో మంగళవారం బాల బాలికలకు సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా టీచర్లు, మహిళా కానిస్టేబుళ్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు శక్తి యాప్ వినియోగం, కరపత్రాలను ఆవిష్కరించారు. తదితర అంశాలపై ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మీ సుజన, కమల సుజిని, వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ మాట్లాడారు. సైబర్ నేరాలకు పాల్పడే వారికి 2 నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.2 లక్షల వరకు జరిమానా విధిస్తారన్నారు. ఆకతాయిల నుంచి సంరక్షించుకునేందుకు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల మహిళా టీచర్లు, బాలబాలికలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు గుర్తింపు శిబిరాలేవీ?



ఏలూరులో ఏడీ రామ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం

భీమడోలు: దివ్యాంగుల గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో తామంతా సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని దివ్యాంగులు ఆవేదన వ్యక్తంచేశారు. అర్హులైనవారికి పరికరాలను అందించాలని కోరుతూ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, వికలాంగుల సంక్షేమ జిల్లా సహాయ సంచాలకులు రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వాటి ప్రతులను మంగళవారం భీమడోలులోని విలేకరులకు ఆయన అందించారు. దివ్యాంగులకు పరికరాలు అందించేందుకు అవసరమైన గుర్తింపు కార్డులు ఉండాలని, ఆ గుర్తింపు శిబిరాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని, అర్హులైనవారికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. బ్యాటరీ మోటార్ సైకిళ్లు, ట్రై సైకిళ్లు, చెవిటి మిషన్లు, వీల్‌చైర్స్, చంకకర్రలు అందక నానా అవస్థలు పడుతున్నారని ఏడీకి వినతి పత్రం అందించారు. ఆగస్టు ఆఖరుకు సమస్య పరిష్కరిస్తామని ఏడీ హామీ ఇచ్చారని ఆయన విలేకరులకు తెలిపారు.

శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

భీమడోలు: గుండుగొలను సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న భీమడోలు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ హైకోర్టు ఉత్తర్వులను పాటించకుండా కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్నారని, సమగ్ర విచారణ చేసి అతడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీసీసీబీ జిల్లా సీఈవోకు మంగళవారం మాజీ సొసైటీ చైర్మన్ వగ్వాల వెంకట భాస్కర్ ఫిర్యాదు చేశారు. గతంలో పని చేసిన సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వి.పవన్ చక్రవర్తి కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా సొసైటీ ఇంచార్జి సీఈవోగా ఎన్‌వీ మోహనరావును నియమించారన్నారు. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారి విచారణ చేసి ఇన్‌చార్జి సీఈవో మోహనరావు నియామకం చెల్లుబాటు కాదని నివేదికను అందించారన్నారు కోర్టు ఆదేశాలు, విచారణాధికారి నివేదికలను అమలు చేయాలని అనేక సార్లు లేఖలు అందించినా ఉద్దేశ్య పూర్వకంగా అమలు చేయకుండా వెళ్లిపోయారన్నారు. ప్రస్తుత పర్సనల్ ఇన్‌చార్జి కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కోర్టు ధిక్కారానికి పాల్పడిన పర్సన్ ఇంచార్జి వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సీఈవోలకు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం రాత్రి వగ్వాల భాస్కర్ విలేకరులకు తెలిపారు.

రైతులు తప్పనిసరిగా బీమా చెల్లించాలి



రైతులకు సాగులో పలు సూచనలు అందజేస్తున్న ఏఓ శ్రీనివాసరావు

పెదవేగి: రైతులు ఖచ్చితంగా క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. పెదవేగి మండలం పెదకడిమి గ్రామ పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం పెదకడిమి గ్రామ సర్పంచ్ కొనరాజు బలరామకృష్ణ చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి రైతులు తప్పనిసరిగా బీమా చెల్లించాలని సూచించారు. ఎకరాకు రూ.840 ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు అకాల వర్షాల వల్ల గాని ఎటువంటి అవాంతరాల వల్ల పంట నష్టం కలిగినప్పుడు క్రాప్ ఇన్సూరెన్స్ రైతుకు తోడుగా ఉంటుందని రైతులకు వివరించారు.

రైతులు నానో యూరియాను వాడాలి

పెదపాడు: యూరియాకు బదులు నానో యూరియా వాడుకోవాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి షేక్ ఇమామీ ఖాసిమ్ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం, పెదపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులతో మాట్లాడారు. పొడి యూరియా 3 బస్తాలు వినియోగిస్తారని దీని వలన నేల గాలి నీరు కలుషితమవుతాయని దీని బదులు ఒక లీటరు నానో యూరియా వాడటంవలన వాతావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. రవాణా వ్యయం, ఖర్చు, ఆదా అవుతుందని చెప్పారు. పొడి యూరియాల నేలలో వేయాలని, నానో యూరియా పంటపై పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు బొప్పిడి కాశీబాబు, అక్కినేని వంశీకృష్ణ, కట్నేని యుగంధర్ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించి పనులు కల్పించాలి



జేసీఎల్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు, ఇఫ్టూ నాయకులు

ఏలూరు (టూటౌన్): జీతాలు పెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు నెలలుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సోమవారం వంగూరూ గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో కక్షగట్టిన యాజమాన్యం గేటుకు తాళం వేసింది. యాజమాన్యం చర్యను వ్యతిరేకిస్తూ మంగళవారం కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కంద్రిక గూడెం సెంటర్ నుండి ప్రదర్శనగా బయలుదేరి అశోక్ నగర్ వంతెన మీదుగా లేబర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ గంట సేపు ధర్నా నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందించి, వెంటనే మేనేజ్మెంట్ తో ఫోన్లో సంప్రదించారు. వెంటనే గేటుకు తాళం తీసి కార్మికులందరికీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం కార్మికులు ఊరేగింపుగా చాణక్యపురి కాలనీలోని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీల చట్టం ప్రకారం ఉండవలసిన సౌకర్యాలు లేవంటూ వినతిపత్రం అందజేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఏలూరు టౌన్: పట్టణంలోని చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన దాసరి రోషన్ (13) ఈ నెల 28న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు వెంటనే ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయగా బాలుడు గిద్దలూరు ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావటంతో సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ కె.సత్యనారాయణ గిద్దలూరు వెళ్లిబాలుడ్ని సురక్షితంగా ఏలూరు తీసుకువచ్చారు. అనంతరం బాలుడ్ని తల్లికి అప్పగించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ, పిల్లలు కనిపించకపోతే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.